www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | ఆదివారం 2,ఆగస్టు, 2026



## వరద ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి

ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

గోదావరి తీర ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం.

పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి.



2 లో..

**భద్రాద్రి ములుగు జిల్లా :** వరద ముప్పుపై ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, గోదావరి తీర ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేస్తున్నామని, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంగపేటలో గోదావరి వరద ప్రవాహాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు.

## భద్రాచలం జ్యుడీషియల్ కోర్టును సందర్శించిన జిల్లా,సెషన్స్ జడ్జి శ్రీమతి జి. ప్రేమలత



2లో



భద్రాద్రి న్యూస్ భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా సెషన్స్ జడ్జి శ్రీమతి జి. ప్రేమలత గారు శనివారం భద్రాచలంలో అధికారిక పర్యటన నిర్వహించారు. పర్యటనలో భాగంగా ముందుగా భద్రాచలం జ్యుడీషియల్ కోర్టును సందర్శించి కోర్టు ఆవరణ, న్యాయస్థానాల పనితీరు, మౌలిక సదుపాయాలు, వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం న్యాయాధికారులు, భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై కోర్టు నిర్వహణ, మౌలిక వసతులు, న్యాయవాదుల అభిప్రాయాలు మరియు కోర్టు అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

## 24×7 కంట్రోల్ రూమ్ ద్వారా ప్రజలకు తక్షణ సేవలు

వర్షాల అత్యవసర పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

జిల్లా కలెక్టర్ అంకిత్




3లో

భద్రాద్రి కొత్తగూడెం, (భద్రాద్రిన్యూస్ ): వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.

## భారీ పెట్టుబడి మోసం

కేసును ఛేదించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు

ప్రధాన నిందితుడి అరెస్టు.

నేరార్జిత ఆస్తులుగా గుర్తించిన 35 వాహనాలు స్వాధీనం



భద్రాద్రి కొత్తగూడెం ,ఆగస్టు 1( భద్రాద్రిన్యూస్ ):- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం.134/2026 కేసులో ప్రధాన నిందితుడు బేతంపూడి భరత్ కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 35 వాహనాలు, ఇతర ..

2లో

## గోదావరి వరద నివారణలో ప్రభుత్వాల ఉదాసీన వైఖరిని ప్రజలు గమనించాలి

పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంతో భద్రాచలం ప్రాంతానికి ముంపు

ఈ అంశంపై అనేకసార్లు పోరాటం చేశానన్న మాజీ మంత్రి పువ్వాడ



3లో

భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 2,ఆగస్టు, 2026

# వరద ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి





**మొదటి పేజీ తరువాయి**

అనంతరం వరద ముంపు ప్రాంతాల బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మంగపేట గోదావరి కరకట్ట నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నందని, నది పరివాహక ప్రాంతాల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్య సౌకర్యాలు సహా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితులను పరామర్శించిన మంత్రి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,ఆర్డీవో కృష్ణవేణి, డి పి ఓ వెంకయ్య, తహసిల్దార్ తోట రవీందర్, ఎం పి డి ఓ బద్రూ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ పెట్టుబడి మోసం

చరాస్తులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వివరాలను వెల్లడించడం జరిగింది.

భార్వాటీ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితుడు తాను భద్రాచలం ఐటీసీ పేపర్ బోర్డ్స్‌లో లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నానని, తనతో భాగస్వామిగా ఉంటే కాంట్రాక్ట్ పనులు ఇప్పించి అధిక లాభాలు అందిస్తానని నమ్మబలికి పలువురు బాధితుల నుంచి సుమారు రూ.52 కోట్ల మేర పెట్టుబడుల పేరుతో మోసపూరితంగా డబ్బులు సేకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

బాధితుల విశ్వాసాన్ని పొందేందుకు నకిలీ భాగస్వామ్య ఒప్పందాలు, తప్పుడు పత్రాలు రూపొందించి, లాభాల్లో 4 శాతం వాటా ఇస్తామని హామీలు ఇచ్చి మోసానికి పాల్పడినట్లు విచారణలో తేలిందని తెలిపారు. అలాగే బీకే నాయుడు అండ్ కో., రాజేశ్వరి ట్రావెల్స్ పేర్లతో సంస్థలను నిర్వహిస్తూ ఈ మోసపూరిత కార్యకలాపాలు సాగించినట్లు గుర్తించినట్లు వెల్లడించారు.

సాంకేతిక ఆధారాలు, ఆర్థిక లావాదేవీల విశ్లేషణ ఆధారంగా నిందితుడిని కేరళ రాష్ట్రంలోని పాలా ప్రాంతంలో అరెస్టు చేసి, ట్రాన్సిట్ వారెంట్‌పై జిల్లాకు తీసుకువచ్చి పోలీసు కస్టడీలో విచారించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా నేరార్జిత ఆస్తులుగా భావిస్తున్న 6 బస్సులు, ఒక వాటర్ ట్యాంకర్ లారీ, 3 ట్రాక్టర్లు, 2 వ్యవసాయ పరికరాలు, 7 కార్లు, 14 ద్విచక్ర వాహనాలు, 2 ట్రైలర్లు కలిపి మొత్తం 35 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా బాధితుల నుంచి మోసపూరితంగా సేకరించిన డబ్బుతో భద్రాచలంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఒక మూడు అంతస్తుల భవనం, ఒక ప్లాట్ కొనుగోలు చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ కేసులో ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, సంబంధిత పత్రాల పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. మరిన్ని బాధితులను గుర్తించడం, నేరార్జిత ఆస్తులను గుర్తించి స్వాధీనం చేసుకోవడం, పూర్తి మనీ ట్రైల్‌ను వెలికితీసే దిశగా దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

అధిక లాభాలు వస్తాయని, తక్కువ సమయంలో పెట్టుబడికి రెట్టింపు లేదా భారీ రాబడులు వస్తాయని చెప్పే వ్యక్తులు లేదా సంస్థలను గుడ్డిగా నమ్మి డబ్బులు పెట్టవద్దని ప్రజలకు సూచించారు. ఆకర్షణీయమైన హామీలు, నకిలీ పత్రాలు, తప్పుడు ఒప్పందాలతో మోసగాళ్లు ప్రజలను మభ్యపెడుతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనుమానాస్పద పెట్టుబడి పథకాలపై సమాచారం తెలిసినా లేదా మోసానికి గురైనా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రజల అప్రమత్తతతోనే ఇటువంటి ఆర్థిక నేరాలను సమర్ధవంతంగా అరికట్టవచ్చని తెలిపారు.

ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన లక్ష్మీదేవిపల్లి పోలీసు సిబ్బందిని, జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు.






# భద్రాచలం జ్యుడీషియల్ కోర్టును సందర్శించిన జిల్లా,సెషన్స్ జడ్జి శ్రీమతి జి. ప్రేమలత

**మొదటి పేజీ తరువాయి**



ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి కోర్టుకు వచ్చే న్యాయవాదులు, కక్షిదారుల సౌకర్యార్థం కోర్టు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని జిల్లా జడ్జి గారి దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు ప్రస్తుతం ఉన్న షెడ్‌ను పరిశీలించాలని కోరగా, జిల్లా జడ్జి గారు ఆ షెడ్‌ను స్వయంగా సందర్శించి పరిశీలించారు. అలాగే కోర్టులో అవసరమైన సిబ్బంది సంఖ్యను పెంచాలని, భద్రాచలంలో పెరుగుతున్న కేసుల భారాన్ని దృష్టిలో ఉంచుకొని అదనపు జిల్లా ౘ సెషన్స్ కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. దీనిపై జిల్లా జడ్జి శ్రీమతి జి. ప్రేమలత గారు సానుకూలంగా స్పందిస్తూ, ఈ అంశాలను గౌరవ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనంతరం జిల్లా జడ్జి గారు భద్రాచలం స్పెషల్ సబ్– జైలును సందర్శించి అక్కడి పరిపాలన, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, మౌలిక, భోజనం వసతులను, ఉచిత న్యాయ సహాయాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. జైల్లోని ఖైదీలు అగరబత్తి తయారీ విధానాన్ని కొనియాడారు. తదుపరి మానవసేవ వాలంటరీ ఆర్గనైజేషన్ వారి ఓల్డ్ ఏజ్ హోమ్‌ను సందర్శించి అక్కడ నివసిస్తున్న వృద్ధులను పలకరించి, వారికి పండ్ల రసాన్ని అందించారు, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు, వృద్ధాశ్రమంలో అందిస్తున్న సేవలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. ఈ పర్యటనలో భద్రాచలం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివ నాయక్, భద్రాచలం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ దుర్గా భవాని, భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, జాయింట్ సెక్రెటరీ తాత లలిత, లేడీస్ రిప్రజెంటేటివ్ తరుణి, హైకోర్టు న్యాయవాది పీవీ కృష్ణమాచారి, సీనియర్ న్యాయవాదులు కె శ్రీమన్నారాయణ, చుక్క నాగ అంబేద్కర్, పేరాల వెంకటేశ్వర్లు, పేరాల నాగరాజు, బందారు అరుణ్ చంద్, పామరాజు తిరుమలరావు, అవులూరి సత్యనారాయణ, కె అరుణ శ్రీ, సాధన పల్లి సతీష్, వై వినీలా రాణి, బందారు రమేష్, దండమూడి శ్రీనివాస్, విద్యాధరి, ఎం సంధ్యారాణి, దండమూడి హర్షిని, శ్రీనివాస్, చందన తదితర న్యాయవాదులు మరియు కోర్టు స్టాఫ్ పాల్గొన్నారు.

# తగ్గుముఖం పట్టిన గోదావరి

**చర్ల–వెంకటాపురం రాకపోకలు పునఃప్రారంభం**

**భద్రాద్రి న్యూస్, వెంకటాపురం**

వెంకటాపురం మండలం బోదాపురం పంచాయతీ పరిధిలోని బ్రిడ్జి వద్ద గోదావరి ప్రవాహం తగ్గడంతో శనివారం సాయంత్రం నుంచి వాహనాలు, ప్రజల రాకపోకలు యధావిధిగా కొనసాగుతున్నాయి. గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల కారణంగా గోదావరి ఉధృతి పెరిగి బల్లకట్టు వాగు, జిన్నెల రేవు బ్రిడ్జి మునిగిపోవడంతో చర్ల–వెంకటాపురం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రస్తుతం పరిస్థితి సాధారణంగా ఉండటంతో అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 2,ఆగస్టు, 2026

## 24×7 కంట్రోల్ రూమ్ ద్వారా
# ప్రజలకు తక్షణ సేవలు

మొదటి పేజీ తరువాయి

వర్షాల కారణంగా తలెత్తే అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా కేంద్రంలోని ఐ డి ఓ సి కార్యాలయంలో జీ--19 గదిలో 24ఐ7 జిల్లా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 3, సోమవారం నుంచి వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులను మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు.

ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు, రాత్రి 9.00 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 7.00 గంటల వరకు మూడు షిఫ్టుల్లో కంట్రోల్ రూమ్ నిరంతరాయంగా పనిచేస్తుందని తెలిపారు.ప్రజల నుంచి కంట్రోల్ రూమ్‌కు అందే ఫిర్యాదులు, సమాచారం, వర్షాల కారణంగా తలెత్తే అత్యవసర పరిస్థితులను వెంటనే నమోదు చేసి సంబంధిత శాఖలకు సమాచారం అందిస్తూ తక్షణ చర్యలు చేపట్టేలా సమన్వయం చేయాలని విధుల్లో ఉన్న సిబ్బందిని ఆదేశించారు. అందిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి, దానిపై తీసుకున్న చర్యల వివరాలను కూడా నమోదు చేయాలని సూచించారు.

జిల్లాలో వర్షాల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా రహదారులు దెబ్బతినడం, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం వంటి పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత శాఖలు స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

సంబంధిత శాఖల జిల్లా అధికారులు తమ శాఖలకు కేటాయించిన అధికారులు, ఉద్యోగులు విధులకు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎవరైనా సెలవులో ఉన్నట్లయితే వారి స్థానంలో వెంటనే ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించాలని కలెక్టర్ ఆదేశించారు.

అత్యవసర పరిస్థితుల దృష్ట్యా కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా లేదా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు.వర్షాల కారణంగా అత్యవసర పరిస్థితులు లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్ 08744-241950 నంబర్‌కు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు. ప్రజల నుంచి అందే ప్రతి సమాచారంపై వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం అన్ని వేళలా సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

# గోదావరి వరద నివారణలో ప్రభుత్వాల ఉదాసీన వైఖరిని ప్రజలు గమనించాలి

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 1 (భద్రాద్రిన్యూస్ ):**



భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం కనిపిస్తున్న గోదావరి వరద ఉద్ధృతి సహజ పరిస్థితుల వల్ల మాత్రమే కాదని, దిగువన ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావం కూడా ప్రధాన కారణమని ప్రజలు గమనించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా భద్రాచలం, దాని పరిసర గ్రామాల్లో ముంపు సమస్య మరింత తీవ్రరూపం దాల్చిందని వరదలు వచ్చిన ప్రతిసారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

పోలవరం ముంపు సమస్యపై తాను మంత్రిగా బీఆర్ఎస్ పార్టీ తరఫున తొలి నుంచి నిరంతరం పోరాటం చేశానని తెలిపారు. గతంలో అనేక వేదికలపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణ ప్రజల పక్షాన బలంగా గళం వినిపించానని గుర్తుచేశారు. భద్రాచలం ప్రాంత ప్రజల ప్రయోజనాల పరిరక్షణలో బీఆర్ఎస్ ఎప్పటికీ రాజీపడదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం బాధ్యతలు నెట్టేసుకునే ధోరణిని విడనాడి, పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై సమగ్ర అధ్యయనం నిర్వహించి, భద్రాచలం పరిసర ప్రాంతాలకు శాశ్వత ముంపు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వరదల సమయంలో తాత్కాలిక సహాయక చర్యలకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో ముంపు సమస్య పునరావృతం కాకుండా శాశ్వత కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని కోరారు.

# గంజాయి పై ముమ్మురంగా తనిఖీలు...




**గంజాయి తరలిస్తే కఠిన చర్యలు**

పాల్వంచ, ఆగస్టు 1(భద్రాద్రి న్యూస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) ఆదేశాల మేరకు, పాల్వంచ సబ్-డివిజనల్ డీఎస్పీ పర్యవేక్షణలో పాల్వంచ టౌన్ పోలీసులు శనివారం పట్టణ పరిధిలోని గంజా హాట్‌స్పాట్ ప్రాంతాలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో గంజా రవాణా, విక్రయాలు మరియు వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం మరియు పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఈ తనిఖీలు చేపట్టబడినవి. ఇలాంటి తనిఖీలు అనుమానాస్పద ప్రాంతాలలో నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.ఇటీవల పాల్వంచ పట్టణంలో గంజా వినియోగదారులపై (జశీఅంబఎవతీం) మరియు గంజా సంబంధిత కేసులు నమోదు కావడంతో, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తూ, గంజా విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. గంజా రవాణా దారులు, విక్రేతలు మరియు వినియోగదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ ప్రత్యేక తనిఖీలలో పాల్వంచ టౌన్ ఎస్ఐ టి. నాగరాజు, ఎస్ఐ విజయ, హరిబాబు, హెడ్ కానిస్టేబుల్ రఘురాం రెడ్డి మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాచలం మండల విద్యాశాఖ అధికారిగా బెక్కంటి

**- పి ఆర్ టి యు హర్షం**

**భద్రాద్రి న్యూస్ భద్రాచలం**



భద్రాచలం మండల విద్యాశాఖ అధికారిగా ఎస్ ఎన్ ఎ ఎం, జడ్పీహెచ్ఎస్ ,న ర్సాపురం ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు నియామకం పట్ల పి .ఆర్ .టి. యు .టి యస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కారంపూడి. దశమ్ బాబు , దుమ్మగూడెం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి. శ్రీనివాసరావు బి. మల్లికార్జునరావు, జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు పి. నరసయ్య, సిహెచ్. ప్రభాకర్ రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బి. భాస్కర్ గార్లు హర్షం వ్యక్తం చేశారు.

# ఫోటోగ్రాఫర్ రాజుకు మంత్రి సీతక్క పరామర్శ..

**రూ.20 వేల తక్షణ సాయం హామీ!**

**రూ.15 లక్షల నష్టం ముందు ఆ సాయం చాలదు.. ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని ప్రజల డిమాండ్?**

**జీవనాధారం కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన అండగా నిలవాలని విజ్ఞప్తి!**

**వాజేడు ఆగస్టు 1 భద్రాద్రి న్యూస్**





ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్నిప్రమాదం ఫోటోగ్రాఫర్ చెన్నం రాజు కుటుంబాన్ని క్షణాల్లో రోడ్డున పడేసింది. ఏళ్ల తరబడి కష్టపడి కూడబెట్టుకున్న కెమెరాలు, కంప్యూటర్లు, ఫోటోగ్రఫీ పరికరాలు, ఇంటి సామగ్రి అగ్నికి ఆహుతై సుమారు రూ.15 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. కట్టుకున్న బట్టలు తప్ప మిగిలిందేమీ లేక కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది.ఈ ఘటనపై స్పందించిన రాష్ట్ర మంత్రి సీతక్క బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తక్షణ సహాయంగా రూ.20 వేల ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు చర్యలు తీసుకుంటామని, నిత్యావసర సామాగ్రి కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సహకరిస్తామని భరోసా ఇచ్చారు.మంత్రి మాట్లాడుతూ, అగ్నిప్రమాదంతో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని ప్రభుత్వం ఒంటరిగా వదిలిపెట్టదని, అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అయితే, రూ.15 లక్షలకు పైగా నష్టం చవిచూసిన కుటుంబానికి రూ.20 వేల తక్షణ సాయం మాత్రమే సరిపోదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఫోటోగ్రఫీ వృత్తినే జీవనాధారంగా చేసుకున్న చెన్నం రాజు మళ్లీ నిలదొక్కుకోవాలంటే కెమెరాలు, కంప్యూటర్లు, ఇతర పరికరాలు అత్యవసరం. అవి లేకుంటే కుటుంబానికి ఉపాధి మార్గమే ఉండదని ఆవేదన వ్యక్తమవుతోంది. అందువల్ల ప్రభుత్వం ఈ ఘటనను ప్రత్యేక కేసుగా పరిగణించి అత్యవసర ఆర్థిక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని, కొత్త ఫోటోగ్రఫీ పరికరాల కొనుగోలుకు గ్రాంట్ లేదా వడ్డీలేని రుణం అందించాలని, ఇందిరమ్మ ఇల్లు వెంటనే మంజూరు చేసి జీవనోపాధి పునరుద్ధరణకు అవసరమైన అన్ని చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ప్రజలు, ప్రజాసంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.ఒక కష్టజీవి కుటుంబం మళ్లీ నిలబడేలా ప్రభుత్వం వేగంగా స్పందిస్తేనే ఈ పరామర్శకు పూర్తి అర్థం ఉంటుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆదివాసి సంఘ నాయకుల సమావేశం

**భద్రాద్రి న్యూస్ పాల్వంచ**



పాల్వంచ మండలం టౌన్ రూరల్ ప్రాంతంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఆగస్టు 9వ తారీఖున ఘనంగా నిర్వహించాలి అధిక సంఖ్యలో ఆదివాసి ఉద్యోగ, వ్యాపార రాజకీయ సంఘాలు, మేధావులు, ప్రముఖులు,ప్రజలు, మహిళలు, యువకులు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామ పటేల్ పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘ నేతలుశనివారం పిలుపునిచ్చారు ఈ కార్యక్రమం పాల్గొన్న ఆదివాసి రాష్ట్ర నాయకులు సోయం సత్యనారాయణ,అరేం ప్రశాంత్,పూనెం నాగేశ్వరరావు, వజ్జ వాసు ,తాటి శేషు,కుంజ లక్ష్మయ్య,సోయం బాలు,పద్దం నాగేశ్వరరావు,హ్యూమన్ రైట్స్ మహిళా నాయకురాలు, సోయం రాజ్యలక్ష్మి, వర్ష స్వాతి తదితరులు పాల్గొన్నారు

# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఆరెంజ్ డే వేడుకలు ...

**ప్రత్యేక్ష ఆకర్షణలో విద్యార్థిని నక్షత్ర...**




**పాల్వంచ, ఆగస్టు1 ( భద్రాద్రి న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం అంగరంగ వైభవంగా ఆరెంజ్ డే వేడుకలు జరిగాయి. చిన్నారులు ఉత్సాహంగా ఆరెంజ్ కలర్ దుస్తులు ధరించి ఆరెంజ్ కలర్ వస్తువులు ఆరంజ్ కలర్ బెలూన్స్ తో అందరినీ ఆకర్షించారు. ప్రత్యేకమైన ఆకర్షణలో మొలుగూరి నక్షత్ర శ్రీనెస్త్ర నిలిచింది. పిల్లలలో చదువుతోపాటు రంగుల్లోని వస్తువులను రంగుల గురించి పిల్లలకు తెలిపేదే ఆరెంజ్ కలర్ డే అని వేడుకలు నిర్వహించామని పిల్లలలో ఉత్సాహాన్ని నింపుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు.

# నవజాత శిశువుకు తల్లిపాలే రక్షణ కవచం

**జిల్లా సంక్షేమ అధికారిని జె. స్వర్ణలత లేనినా**



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 1 (భద్రాద్రిన్యూస్):** బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలలు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని, ఆ తర్వాత మరో సంవత్సరం పాటు తల్లిపాలు ఇవ్వడం తల్లి బిడ్డల ఆరోగ్య సంరక్షణకు రక్షణ కవచం లాంటిదని జిల్లా సంక్షేమ అధికారిని జే స్వర్ణలత లేనినా పేర్కొన్నారు. స్థానిక భద్రాద్రి కొత్తగూడెం బస్టాండ్ లోని తల్లి పాలిచ్చే గదిని లాంఛనంగా ప్రారంభించి బాలింతలకు తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిని మాట్లాడుతూ ప్రసవించిన మొదటి గంటలోపే తల్లిపాలు ఇవ్వడాన్ని ప్రారంభించేలా తల్లులకు సహకారం అందించాలని, తల్లిపాలే నవజాత శిశువును అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయని, బిడ్డ పుట్టినప్పటి నుండి ఆరు నెలల నిండే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించడం, ఈ ఆరు నెలల్లో బిడ్డ ఎదుగుదల మరి అభివృద్ధికి అవసరమైన పోషకాలన్ని తల్లిపాలలోని లభిస్తాయని, ఇలాంటి ఇతర పదార్థాలు తినిపించకుండా, త్రాగించకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నప్పుడు మాత్రమే తల్లి బిడ్డల ఆరోగ్య భద్రత ఉంటుందని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా బిడ్డ పుట్టిన వెంటనే తేనే, పంచదార లాంటి మూఢనమ్మకాలు నమ్మకుండా ముర్రుపాలె ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అర్బన్ సిడిపిఓ, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, మహిళా సాధికారిత జిల్లా బృందం, ఆర్టీసీ డిపో మేనేజర్,సిబ్బంది, బాలింతలు పాల్గొన్నారు.

# పోలంపల్లిలో బీఎల్‌వోలు, బీఎల్‌ఏలకు ఘన సన్మానం

**శాతం వంద లక్ష్య సాధనలో ప్రతిభ కనబర్చిన ఎన్నికల సిబ్బందికి అభినందనలు**



**కారేపల్లి, ఆగస్టు 1(భద్రాద్రి న్యూస్ రాములు ):** సింగరేణి మండలం పోలంపల్లి గ్రామ పంచాయతీలో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో శాతం వంద లక్ష్యాన్ని విజయవంతంగా పూర్తి చేసిన బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్‌ఏలు)ను గ్రామ సర్పంచ్ ధారావత్ హేమలత–బాలాజీ, మాజీ సర్పంచ్ ధారావత్ బద్రునాయక్ ఘనంగా సన్మానించారు. గ్రామంలో బీఎల్‌వోలుగా విధులు నిర్వహించిన అంగన్‌వాడీ ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, ఈసం లీలావతి, బీఎల్‌ఏలుగా సేవలందించిన ధారావత్ వినాయక్, ఈసం వెంకటలక్ష్మిలకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన లక్ష్యాన్ని గ్రామంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో శాతం వంద పూర్తిచేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ విజయంలో కృషి చేసిన ఎన్నికల సిబ్బంది సేవలను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని సన్మాన గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# గిరిజన గ్రామంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**భద్రాద్రి న్యూస్ చర్ల**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, సింగసముద్రం, జూలై 31: గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సింగసముద్రం గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించబడింది. గ్రామంలోని జి.ఎస్.ఎస్ చైల్డ్ కేర్ కేంద్రంలో 115 మంది నిరుపేద విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్ మరియు పలకలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, చైల్డ్ కేర్ సెంటర్ ఇన్‌చార్జ్ పూజారి లక్ష్మీ నారాయణ, చైల్డ్ కేర్ సెంటర్ సిబ్బంది, సంస్థ సిబ్బంది మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, గ్రేస్ సర్వీస్ సొసైటీ నిర్వహిస్తున్న ఇలాంటి సేవా కార్యక్రమాలు గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుపై ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్న గ్రేస్ సర్వీస్ సొసైటీని వారు ప్రత్యేకంగా అభినందించారు.ద

# జగ్గు తండా ప్రాథమిక పాఠశాలలో బాల గ్రామసభ

**గుండాల:1 ఆగస్టు భద్రాద్రి న్యూస్.**

ప్రభుత్వ ఆదేశాను ప్రకారం మండలం లోని జగ్గు తండా ప్రాథమిక పాఠశాలలో బాల గ్రామసభ నిర్వహించటం జరిగింది ఈ సభలో గ్రామపంచాయతీ సర్పంచ్ జరుపుల కిషన్ విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాల పనితీరు గురించి పరిసరాల పరిశుభ్రత గురించి వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యాభ్యాస విధానం గురించి పాఠశాల క్రీడలు ప్రయోజనాల గురించి పాఠశాల ఉపాధ్యాయుల విద్యా బోధన గురించి అడిగి తెలుసుకున్నారు విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అవరోధించాలని ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని ఉపాధ్యాయులు బోధించే విద్యను శ్రద్ధగా అభ్యసించాలని వారికి సూచించారు ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కొరస ఉమాదేవి పాఠశాల ఉపాధ్యాయులు బిఎల్ఓ సంపత్ పాల్గొన్నారు.



# బడ్జెట్ పాఠశాలల పరిరక్షకుడు సూరపనేని శేషన్నకు ఘన నివాళి

**భాగ్యనగర్ పబ్లిక్ స్కూల్లో నాలుగో వర్ధంతి నిర్వహణ**



**సింగరేణి మండలం, ఆగస్టు1( భద్రాద్రి న్యూస్ రాములు):** బడ్జెట్ పాఠశాలల ప్రాణప్రదాత, తెలంగాణ రాష్ట్ర విద్యాసంస్థల మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సూరపనేని శేషన్న నాలుగో వర్ధంతి సందర్భంగా సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామంలోని భాగ్యనగర్ పబ్లిక్ స్కూల్లో ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ అరంధకర్ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శేషన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యారంగానికి, ముఖ్యంగా బడ్జెట్ పాఠశాలల అభివృద్ధికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అరంధకర్ మహేష్, ఉపాధ్యాయుడు అరంధకర్ సాయ్ గణేష్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, పాఠశాల సిబ్బంది పాల్గొని శేషన్నకు ఘనంగా నివాళులర్పించారు.

# డోర్నకల్ సి ఎస్ ఐ10 వ బిషప్ గా డాక్టర్ రేవ కే సైనం రాజ్

**సి నాడులో ఏకగ్రీవం ఎన్నిక**



పాలేరు, ఆగస్టు 1(భద్రాద్రి న్యూస్): డోర్నకల్ సీఎస్ఐ పదవ బిషప్ గా డాక్టర్ రేవ సైనం రాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమిళనాడు రాష్ట్రంలో సి నాడులో జరిగిన బిషప్ సెలక్షన్ సమావేశంలో డాక్టర్ రేవ కే సైనం రాజును ఏకగ్రీయంగా ఎంపిక చేశారు. డోర్నకల్ బిషప్ ఎన్నికలు వాయిదా పడగా సి నాడు మోడరేటర్ చొరవ తీసుకొని బిషప్ ఎన్నికను ఏకగ్రీన్ చేశారు. డాక్టర్ రేవ సైనం రాజ్ గత 40 సంవత్సరాలుగా చర్చిలలో మత గురువుగా పనిచేస్తూ... గత సంవత్సరం నర కాలంగా డోర్నకల్ డైసిసిలో కోశాధికారిగా పనిచేస్తూ సి ఎస్ ఐ చర్చిల అభివృద్ధికి కృషి చేశారు. డోర్నకల్ డైసీస్ పరిధిలో ఖమ్మం, కొత్తగూడెం, జిల్లాలతో పాటు, చతిస్గడ్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ కొంత భాగం, తెలంగాణ రాష్ట్రాలలో 138 పాస్టేట్లుండగా వీటిలో 3000 చర్చిలు ఉన్నవి. ఈ చర్చిల ద్వారా వేలాదిమందికి ఆధ్యాత్మికమైన జ్ఞానాన్ని అందిస్తున్నారు. ఈ చర్చిలకు కేంద్రమైన డోర్నకల్ డయాసిస్ పదవ బిషప్ గా డాక్టర్ రేవ సైనం రాజు ఏకగ్రీవ ఎన్నిక పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది సౌమ్యుడుగా, అందరిని కలుపుకొని పోయే విశాల మనస్తత్వంతో ఉన్న సైనం రాజు డోర్నకల్ డైసిస్ అభివృద్ధికి భవిష్యత్తులో కీలకంగా వ్యవహరించనున్నారు. డోర్నకల్ డైసీస్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలో, ఆస్పత్రిలలో కార్పొరేట్ స్థాయిలో సేవలు అందించే సదుద్దేశంతో తన బాధ్యతలను చురుకుగా నిర్వహించేందుకు డాక్టర్ రేవకే సైన్యం రాజు సన్న హాలు చేస్తున్నారు. డోర్నకల్ డైసిస్ బిషప్ గా ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ కె రేవ

సైనం రాజ్ పట్టాభిషేక మహోత్సవం ఆదివారం ఉదయం 9:30కు డోర్నకల్ డైసీస్ కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ వేడుకలకు డోర్నకల్ డైసీస్ పరిధిలోని మత గురువులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

## బంజారా సోదరుల సమీక్ష సమావేశానికి పిలుపు

**ఆదివారం ఖమ్మం బంజారా భవన్‌లో ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ అధ్యక్షతన సమావేశం**



**సింగరేణి మండలం ఆగస్టు 1( భద్రాద్రి న్యూస్ రాములు ):** ఖమ్మం జిల్లా బంజారా భవన్‌లో ఆగస్టు 2 (ఆదివారం) ఉదయం 10 గంటలకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ అధ్యక్షతన బంజారా సోదరుల సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు గాదెపాడు సర్పంచ్, సింగరేణి మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ తెలిపారు.ఈ సమావేశానికి సింగరేణి మండలంలోని బంజారా సర్పంచులు, బంజారా నాయకులు, బంజారా సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ సూచనల మేరకు ఆయన విజ్ఞప్తి చేశారు. బంజారా సమాజ అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. బంజారా సమాజానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై ఈ సమావేశంలో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొనాలని భూక్య రంజిత్ కుమార్ కోరారు.

## సింగరేణి మండలంలో ఆబ్కారీ శాఖ ఉందా... లేదా?

**వైన్ షాపుల సిండికేట్‌పై ఎందుకు మౌనం? ఎమ్మార్పీకి మించి విక్రయాలు.. రాత్రి వేళ బెల్ట్ షాపుల దందా.. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలంటూ ప్రజల డిమాండ్**




**కారేపల్లి, ఆగస్టు 1( భద్రాద్రి న్యూస్ రాములు) :**

సింగరేణి మండలంలో ఆబ్కారీ (ఎక్సైజ్) శాఖ పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరల కంటే రూ.15 నుంచి రూ.30 వరకు అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తున్నప్పటికీ, సంబంధిత అధికారుల నుంచి క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించడం లేదు.

వైన్ షాపులు ఒకే విధంగా అదనపు ధరలు వసూలు చేస్తుండటంతో సిండికేట్ వ్యవస్థ నడుస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయి. బిల్లు లేకుండా విక్రయాలు, ఎమ్మార్పీ ఉల్లంఘనలు, వినియోగదారుల ఫిర్యాదులు వరుసగా వెలుగులోకి వస్తున్నా ఎక్సైజ్ శాఖ స్పందన లేకపోవడం ప్రజల్లో పలు ప్రశ్నలకు తావిస్తోంది.రాత్రి 9 గంటల తర్వాత గ్రామాల్లో బెల్ట్ షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు సాగుతున్నా పర్యవేక్షణ, తనిఖీలు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. తెలంగాణ ఎక్సైజ్ చట్టం, 1968 ప్రకారం ఎమ్మార్పీ ఉల్లంఘనలు, లైసెన్స్ నిబంధనల ఉల్లంఘనలు, అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు మౌనం వీడకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక బృందంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, ఎమ్మార్పీకి మించి విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణ, బిల్లు లేకుండా సాగుతున్న అమ్మకాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. సోమవారం నాటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు సిండికేట్ వ్యవహారంపై మౌనం వీడకపోతే, ఇప్పటివరకు వెలువడిన అన్ని పత్రికా కథనాల కటింగ్‌లను జిల్లా కలెక్టర్‌కు నేరుగా సమర్పించి, ప్రత్యేక విచారణ కోరనున్నట్లు స్థానికులు హెచ్చరిస్తున్నారు. ప్రజల ఫిర్యాదులు, పత్రికల కథనాలను జిల్లా యంత్రాంగం ఎంతవరకు పరిగణలోకి తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

## కోదాడ పట్టణంలో వాహనాల ముమ్మర తనిఖీ

**50 వాహనాలు సీజ్, వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించిన డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి**

**కోదాడ, ఆగస్టు 1,(భద్రాద్రి న్యూస్ ):** కోదాడ పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై పోలీసులు శనివారం ఉక్కుపాదం మోపారు. కోదాడ సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు సిఐ శివశంకర్ ఆధ్వర్యంలో పట్టణ పోలీస్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సంయుక్తంగా పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం (ట్రిపుల్ రైడింగ్), మైనర్లు వాహనాలు నడపడం, మరియు నంబర్ ప్లేట్లు లేని 50 వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాలను పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహన చోదకులకు, మైనర్ల తల్లిదండ్రులకు డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ



ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై నిఘా ఉంచుతామని, ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని కోరారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రమాదాల నివారణకు ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో మహిళా రైతు దుర్మరణం

**వ్యవసాయ బావి వద్ద విషాదం.. ఇద్దరు కుమార్తెలకు తీరని లోటు**

**కారేపల్లి, ఆగస్టు 1(భద్రాద్రి న్యూస్ రాములు ):**



ఖమ్మం జిల్లా కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో శనివారం విద్యుదాఘాతానికి గురై మహిళా రైతు మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది.

గ్రామానికి చెందిన వడ్డే ఉమ (45) తన భర్త వడ్డే రమేష్‌తో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ భూమికి పనుల నిమిత్తం వెళ్లింది. మధ్యాహ్న సమయంలో భర్త భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లగా, పొలంలో ఒంటరిగా ఉన్న ఉమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో విద్యుత్ మోటార్‌కు సంబంధించిన వైరు తగలడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురై బావిలో పడిపోయింది. భోజనం ముగించుకుని తిరిగి వచ్చిన రమేష్‌కు భార్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. అనంతరం బావిలో చూడగా ఉమ మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. వెంటనే స్థానికులు, బంధువుల సహాయంతో మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. ఈ ఘటనతో విశ్వనాథపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతురాలు ఉమకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మహిళా రైతు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకొని తగిన నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు, స్థానికులు ప్రభుత్వాన్ని కోరారు.

## స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ శ్రీనగర్ లో మెహందీ వేడుకలు

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్ట్ 1 (భద్రాద్రి న్యూస్):** స్థానిక శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్‌లో ఆషాఢ మాసం సందర్భంగా మెహందీ వేడుకలు అయిన హెన్నాజోల్‌ను ఘనంగా నిర్వహించారు.




పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు ఈ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడుతూ ఆషాఢ మాసంలో తెలుగువారందరూ ఎంతో ఇష్టంగా గోరింటాకు పెట్టుకుంటూ కుటుంబ సభ్యులందరితో ఆనందాన్ని పంచుకుంటారు. మెహందీ తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయల్లో ఒక భాగంగా ఉన్నదంటూ అలాంటి మెహందీని విభిన్న ఆకృతులలో కళాత్మకంగా పెట్టుకొని రంగురంగుల దుస్తులలో వచ్చి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులందరిని అభినందించారు. స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్ శ్రీనగర్ సంస్కృతి, సాంప్రదాయాలకు వారధిగా ఉంటుందని తెలియజేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్యను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉన్నతమైన విలువలను భోదిస్తున్నామంటూ నూతన ఆవిష్కరణలకు ముఖద్వారంగా స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్ శ్రీనగర్ నిలుస్తుందని తెలియజేస్తూ మెహందీ యొక్క ప్రత్యేకతను వివరించి ఉత్సాహపరిచారు. ఈ మెహందీ వేడుకలకు విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాల విలువలను విద్యార్థులలో పెంపొందించుటకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలియజేస్తూ ఆషాఢ మాసం అనగానే గుర్తుకు వచ్చేది కుటుంబం అంతా కలిసి గోరింటాకు కాళ్ళకు, చేతులకు పెట్టుకుని ముచ్చటగా కనిపిస్తారని, గోరింటాకులో అనేక ఔషధ లక్షణాలు ఉంటాయని తెలియజేసారు.ఈ మెహందీ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేసారు.

## అజ్మీర్ వశ్య కుటుంబానికి పరామర్శ..

**–బంజారా సంప్రదాయాన్ని చాటిన పోలంపల్లి తండా ప్రజలు**

**కారేపల్లి, ఆగస్టు 1 (భద్రాద్రి న్యూస్ రాములు ):**



కారేపల్లి మండలంలోని పోలంపల్లి తండాలో ఇటీవల మృతి చెందిన అజ్మీర్ వశ్య కుటుంబ సభ్యులను రెండో వార్డు సభ్యుడు లావుద్యా రమేష్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, యువకులు కలిసి పరామర్శించారు. బంజారా సంప్రదాయం ప్రకారం కుటుంబానికి ధైర్యం చెప్పి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భూక్య రవీందర్, గుగులోత్ చిన్న, గుగులోత్ చిన్న రాంసింగ్, గుగులోత్ బావాసింగ్, గుగులోత్ కిషన్, సపావత్ కుమార్, గుగులోత్ హరిదాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, బంజారా సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న పరస్పర సహకారం, మానవత్వం, ఐక్యతకు ఈ సంప్రదాయం నిదర్శనమని పేర్కొన్నారు. బాధలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు.

భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 2,ఆగస్టు, 2026

# 640 అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రారంభం





**భద్రాద్రి న్యూస్ ములుగు:**

ములుగు జిల్లాలోని 640 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ (అంగన్‌వాడీ) సంయుక్త ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు మరియు అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

రాబోయే 10 రోజుల పాటు వాం+ సమాఖ్య సంఘాల మహిళలకు, అలాగే డిగ్రీ, నర్సింగ్ మరియు మెడికల్ కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడనున్నాయి. అదేవిధంగా ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా వివిధ అవగాహన కార్యక్రమాలు, ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టబడతాయి. తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలు, పుట్టిన గంటలోపు శిశువుకు తల్లిపాలు ఇవ్వడం, మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, తల్లి మరియు శిశువు ఆరోగ్యానికి తల్లిపాల ప్రాధాన్యత, సరైన పోషకాహారం, శిశు సంరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించబడుతుంది.

ములుగు జిల్లాలో ప్రస్తుతం 1,429 మంది గర్భిణులు మరియు 682 మంది బాలింతలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వీరితో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా చురుకుగా పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి శ్రీమతి ఈ.పీ. ప్రేమలత గారు మరియు సంబంధిత అధికారులు కోరారు.

# సదరం-యూడీఐడీ కార్డుల జారీని వేగవంతం చేయాలి...

**-అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం-యూడీఐడీ కార్డులు అందేలా చర్యలు**
**-జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు**




**భద్రాద్రి న్యూస్ ములుగు**



అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం--యూడీఐడీ కార్డులు సకాలంలో అందేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.

శనివారం సెర్ప్ సీఈఓ దివ్య సదరం--యూడీఐడీ కార్డుల జారీ పురోగతిపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభి వృద్ధి అధికారులు, ముఖ్య వైద్యాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి పాల్గొన్నారు.

సదరం--యూడీఐడీ కార్డుల జారీ పురోగతి, జిల్లాల వారీగా నమోదవుతున్న దరఖాస్తులు, పెండింగ్ కేసులు, కేంద్రాల పనితీరు, మౌలిక వసతులపై సెర్ప్ సీఈఓ వీసీ ద్వారా సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రభుత్వం సదరం-- యూడీఐడీ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులలో అర్హులైన వారందరికీ సదరం ధృవపత్రాల జారీని వేగవంతం చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సదరం-- యూడీఐడీ కార్డులు అందేలా క్షేత్రస్థాయిలో చురుకుగా పని చేయాలని సూచించారు. జిల్లాలో యూడీఐడీ మూల్యాంకన కేంద్రంలో అవసరమైన పరికరాలు, స్పెషలిస్ట్ వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సకాలంలో సదరం-- యూడీఐడీ ధృవ పత్రాలు జారీకి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డి ఆర్ డి ఓ రవీందర్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్ర శేఖర్, విద్యా శాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేసోనెన్స్ స్కూల్ శ్రీనివాస నగర్ లో మెహందీ ఉత్సవ్

**చిన్నారుల చేతుల్లో కళాసౌందర్యం**

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 1 (భద్రాద్రిన్యూస్ ):-**




ఖమ్మం శ్రీనివాస నగర్ నందు రేసోనెన్స్ పాఠశాలలో చిన్నారుల కోసం మెహందీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్ బాలికలు ఒకరి చేతికి ఒకరు అందమైన మెహందీ డిజైన్లను వేసుకున్నారు. వివిధ రకాల సంప్రదాయ, ఆధునిక డిజైన్లతో చిన్నారుల చేతులు కళకళలాడాయి. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు కూడా చిన్నారులకు మెహందీ వేయడంలో సహాయపడ్డారు. విద్యార్థులు తమకు ఇష్టమైన డిజైన్లను ఎంచుకొని, వాటిని తమ చేతులపై వేసుకుని ఆనందంగా గడిపారు.

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ, "విద్యార్థులలో కేవలం విద్యాపరమైన నైపుణ్యాలను మాత్రమే కాకుండా, వారిలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికి తీయడం మా లక్ష్యం. మెహందీ ఉత్సవాలు వంటి కార్యక్రమాలు పిల్లలలో సృజనాత్మకతను, సాంస్కృతిక అవగాహనను పెంపొందిస్తాయి. మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది' అని పేర్కొన్నారు. ఈ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం కేవలం ఒక సంప్రదాయం మాత్రమే కాదు, దీని వెనుక ఎన్నో ఆరోగ్య, సామాజిక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. తెలుగు సంస్కృతిలో గోరింటాకు ఆషాఢ మాసం లో ఒక ముఖ్యమైన భాగం. గోరింటాకును శుభానికి, సౌభాగ్యానికి ప్రతికగా భావిస్తారు. ఆరోగ్య ప్రయోజనాలు శరీర ఉష్ణోగ్రత నియంత్రణ, నరాల ఉపశమనం, రక్త ప్రసరణ మెరుగుదల అనేక రకాల వ్యాధులను నియంత్రిస్తుందని తెలిపారు. పాఠశాల కరెస్పాండెంట్ నీలిమ మాట్లాడుతూ, "విద్యార్థులు పాఠశాలలో నేర్చుకునే ప్రతి అంశం వారి భవిష్యత్తుకు పునాది కావాలి. ఈ మెహందీ వేడుకలు పిల్లలకు ఆనందాన్ని ఇవ్వడమే కాకుండా, వారిలో సహకారం, సృజనాత్మకత, సామాజిక ఐక్యత వంటి విలువలను పెంపొందిస్తాయి. ప్రతి విద్యార్థి తమ బాల్యాన్ని ఆనందంగా గడపడంతో పాటు, నూతన విషయాలను నేర్చుకోవాలని కోరుకుంటున్నాము" అని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మెహందీ ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు పాఠశాల సిబ్బంది ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు.

# భూక్య రంజిత్ కుమార్ అధ్యక్షతన గాదేపాడు గ్రామసభ

**మహిళల భద్రత, గ్రామాభివృద్ధి, పారిశుధ్యంపై కీలక తీర్మానాలు**



**కారేపల్లి, ఆగస్టు 1 భద్రాద్రి న్యూస్ రాములు ):**

సింగరేణి మండలం గాదేపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. సమావేశంలో ఉప సర్పంచ్ ఉపేందర్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామసభలో మహిళల భద్రతపై విస్తృతంగా చర్చించి, మహిళలు, బాలికల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రాధాన్యాన్ని వివరించి, తల్లిపాల వల్ల శిశువులకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలియజేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీ.పీ.డి.పీ.)పై చర్చించి, ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామపంచాయతీకి వచ్చే నిధులను ఏయే అభివృద్ధి పనులకు కేటాయించాలనే అంశంపై తీర్మానాలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే మూడు నెలల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని తీర్మానించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు గ్రామంలోని అన్ని వీధుల్లో ఫాగింగ్ నిర్వహించి దోమల మందు పిచికారీ చేయాలని నిర్ణయించారు. గ్రామాభివృద్ధి, ప్రజారోగ్యం, మహిళల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తీసుకున్న ఈ నిర్ణయాలను గ్రామస్థులు స్వాగతించారు.

# స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో వెలివిరిసిన స్నేహబంధం

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 1( భద్రాద్రిన్యూస్):-**




స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో శనివారం స్నేహితుల దినోత్సవం ఆనందోత్సవాలతో నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు తరగతి లోని తమ మిత్రుల చేతికి ఫ్రెండ్షిప్ బ్యాండ్ కట్టి, మిఠాయిలు తినిపించి తమ స్నేహ బంధాన్ని చాటిచెప్పారు. చిన్నప్పటి నుండి తరగతిలో తమతో పాటు చదువుకుంటూ ప్రతి తరగతిలో తమతో మైత్రి బంధాన్ని పంచుకుంటున్న తమ మిత్రులతో సరదాగా, హుషారుగా గడిపారు. ఫ్రెండ్షిప్ డే వేడుకలతో పాఠశాలలో ఉత్సాహం, ఆనందం వెల్లి విరిసింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ స్నేహ బంధానికి సరిహద్దులు లేవని, వర్గ, ప్రాంతీయాలకు అతీతంగా స్నేహబంధం గౌరవం ఎల్లప్పుడూ వెల్లి విరుస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు

భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం 2,ఆగస్టు, 2026

## గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు

# శాశ్వత రక్షణ కల్పిస్తున్నాం



వరదలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం..
ముందస్తు చర్యలతో నష్టాల నివారణ.
లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాసం,
ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు చర్యలు.
రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క.

**భద్రాద్రి న్యూస్ ఏటూర్ నాగారం :**
గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తున్నామని, వరదలపై జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తతో ముందస్తు చర్యలతో నష్టాలను నివారణ చేయడం జరిగిందని, లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాసం, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.

శనివారం ఏటూరు నాగారం మండలం కేంద్రం లోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నది వరద ప్రవాహాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వస్సల్ టోప్పో లతో కలసి పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ గత రెండు రోజులుగా తెలంగాణ తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నది ఉప్పొంగుతున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు.

జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఐటిడిఏ పిఓ, సాగునీటి శాఖ అధికారులు, ఇతర




శాఖల అధికారుల తో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని అన్నారు. గత రెండేళ్లుగా ములుగు జిల్లాలో ప్రత్యేక వరద నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసి, వాగులు, గోదావరి పరివాహక ప్రాంతాలు, ముంపు గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించి పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నామని వివరించారు.

గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకున్నప్పటికీ ముందస్తు చర్యల కారణంగా ఎలాంటి నష్టం జరగలేదన్నారు. రెండు నెలల క్రితమే గోదావరి పరివాహక ప్రాంతాల్లో జిల్లా ఉన్నత అధికారులతో, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించి అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. గతంలో రామన్నగూడెంలోకి వరద నీరు చేరేదని, ఈసారి ముందస్తు చర్యలతో ఆ ప్రమాదాన్ని నివారించగలిగామని పేర్కొన్నారు. రామన్నగూడెం, మంగపేట ప్రాంతాల్లో కరకట్ట నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, సుమారు 800 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజలు వరదలు, వాగులు ఉప్పొంగిన సమయంలో వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. వర్షాల సమయంలో అడవుల్లోకి పశువులను మేపేందుకు వెళ్లడం, చేపల వేటకు వెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. 2022, 2023 సంవత్సరాల్లో గోదావరి, జంపన్నవాగు వరదల వల్ల ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మిగిలిన కరకట్ట పనులను కూడా పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు శాశ్వత రక్షణ కల్పిస్తామని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద కుటుంబాలను గుర్తించి రెండో విడతలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్, ఎం పి డి ఓ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్కాన్ ఆపరేషన్ లో 95 మశీది బాలకార్మికులకు విముక్తి

**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**భద్రాద్రి కొత్తగూడెం ,ఆగస్టు 1 (భద్రాద్రిన్యూస్ ):**



బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ –శ×× విడుతలో జిల్లా వ్యాప్తంగా 95 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శనివారం ప్రకటనను విడుదల చేశారు.ఆపరేషన్ ముస్కాన్ శ×× విజయవంతం కోసం జిల్లాలో 05 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు.ఇందులో భాగంగా జూలై 1 నుండి 31 వరకు నెల రోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్ –శ×× కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగింది.ఇందులో 95 మంది బాలకార్మికులను గుర్తించడమైనదని తెలిపారు.ఇందులో 89 మంది మగ పిల్లలు,6 మంది బాలికలు ఉన్నారని తెలిపారు.ఈ 95 మందిని వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను పనిలో పెట్టుకున్న 48 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరిగిందని,38 మందికి నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు.బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదని,బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు.అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100/112 కి ఫోన్ చేసి పోలీసు వారికి సమాచారం అందించాలని తెలిపారు.ఆపరేషన్ ముస్కాన్ –శ×× లో భాగంగా బాలకార్మికులను వారి తల్లిదండ్రులకు అప్పగించిన ప్రత్యేక బృందాల సభ్యులను ఈ సందర్భంగా ఎస్పీ గారు అభినందించారు.

## గోదావరి వరద శాంతించాలని మంత్రి సీతక్క ప్రత్యేక పూజ





**–చీకుపల్లి––పెద్దగొల్లగూడెం దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును పరిశీలిన...**

**భద్రాద్రి న్యూస్ వాజేడు**

గోదావరి వరద శాంతించాలని శనివారం వాజేడు మండలం లోని ముళ్ళకట్ట – పూసూరు వంతెన వద్ద రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వస్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించి గోదావరి వరద శాంతించాలని ప్రత్యేక పూజ చేశారు.

అనంతరం చీకుపల్లి ––పెద్దగొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుకవాగు వంతెన వద్ద భారీ వర్షాలకు దెబ్బతిన్న డైవర్షన్ రోడ్డును పరిశీలించి, పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

గోదావరి నది వరద ప్రవాహంపై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, బ్యాక్ వాటర్ ద్వారా గ్రామాలు కాలనీలు ముంపుకు గురైతే వెంటనే ఆ కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్, ఎం పి డి ఓ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

